# ఎజెండా

"మేడమ్... మీరు బాగా నలిగిపోతున్నారు" కరీంసార్ మాటలకు ఉలిక్కిపడింది శిల్ప. తను మామూలుగానే ఉన్నట్టు మొహం పైకి నవ్వును పులుముకుంటూ తలెత్తి 'ఎందుకు?' అన్నట్టు చూసింది.

లంచ్ అవర్. స్టాఫ్ రూంలో ఎవరూ లేరు. ఇద్దరే టిఫిన్ తింటున్నారు. మిగతా స్టాఫ్ లోకల్‌గానే ఉండడంతో ఇంటికెళ్ళిపోయారు. శిల్ప క్యారియర్‌లో అన్నం తక్కువే ఉన్నా కూర మాత్రం వేరుగా ఒక బాక్స్ నిండా తెస్తుంది. అందులో సగం కరీంకే ఇస్తుంది.

ఈరోజు మాత్రం బాక్స్‌లో చికెన్ కనబడగానే కొద్దిగా దూరంగా జరిగాడు కరీం. రోజూ బాక్స్ తెరువగానే కర్రీ బాక్స్‌ను అతడి ముందుకు నెట్టేది శిల్ప. ఈరోజు అలా చేయలేదు.

"ఏం... ఎందుకలా అన్నారు?" కరీం మౌనంగా ఉండడంతో తనే అడిగింది శిల్ప అన్నం తింటూనే. నలిగిపోవడమే కాదు. లోలోపల సలసల మసిలిపోతున్నారు.... ఆత్మవంచన చేసుకోలేక అభిమానాన్ని చంపుకోలేక మీకు మీరు అంటుకుపోతున్నారు" అన్నాడు కరీం.

అతడి రూపం చూస్తే ఎవరూ గుర్తుపట్టరు కానీ మాటలు వింటే మాత్రం ముస్లీం అని వెంటనే పట్టేస్తారు. అప్పుడప్పుడు మాటల్లో కర్త కర్మక్రియలుండవు.

తినడం ఆపి టక్కున తలెత్తి చూసింది శిల్ప. ఆ మాటలు హృదయాన్ని తట్టి ఏ జ్ఞాపకాల ముడినో విప్పినట్టయింది. అతడనుకున్న భావ సంచలనాలేవీ తనలో లేనట్టుగా మామూలుగా మొహం పెట్టి 'ఎవరి మీదా...? ఎందుకు...?' అని అడిగింది.

ఎంత దాచుకుందామన్నా ఆమె కంఠంలో తీవ్రత దాగలేదు. మరుక్షణమే అయ్యో... దొరికిపోయానే అన్నట్టు గిల్టీ ఫీలింగ్ ఆమె మొహంలో కనిపించింది.

కరీం మాత్రం మామూలుగానే చెప్పుకుపోతున్నాడు. "నిన్న మీ చికెన్ సెంటర్ ముందున్న బ్యానర్‌ను చూసాను. జనం మాత్రం బాగానే ఉన్నారు.." కరీం మాటలను ఆపేశాడు.

అతడి మాటలు ఆగిపోయిన చోటనే శిల్పలో ఆలోచన మొదలయింది. కరీం... శిల్ప ఇద్దరూ సిరిసిల్ల నుంచి ఒకే బస్సులో వచ్చి ఒకే బస్సులో వెళ్తారు. శిల్ప భర్త దామోదర్ బిజినెస్‌మెన్. రాజకీయపు అండ వుంది. వచ్చే ఎలక్షన్లలో పోటీదారుల రేసులో ఉన్నాడు. అందరికంటే ముందు ఉండాలనుకుంటున్నాడు.

చికెన్ సెంటర్ ముందు ఆ బోర్డును పెట్టే చివరి క్షణం వరకూ ఆపాలని ప్రయత్నించింది శిల్ప. భర్త ఒప్పుకోలేదు. "ఆడదానివి నీకేం తెలుసు...?" అన్నాడు.

"తినే తిండిలో కూడా మతం భూతం చూపించాలా...? ఇచ్చట ముడుదార్ అమ్మబడును అని స్పెసిఫిక్‌గా బోర్డు రాయడమెందుకు...? బిజినెస్ బిజినెస్‌లా చెయ్యండి. అందులో కూడా మతం రంగు పూయకండి' భర్తతో వాదిస్తూ అన్నది శిల్ప.

"ఎప్పుడన్నా తుర్కోళ్ళు మన దేవునికి మొక్కుతరా?.. మరి మనం వాళ్ళ దేవునికి ఎందుకు మొక్కాలె. వాళ్ళు ఎప్పుడన్నా కందూరుకు చేస్తరా...? దర్గాకు మొక్కుతరా...? పీరీలు మోత్తారా...? అన్నీ చేసేది మనమే! వాళ్ళ దేవునికి మనమెందుకు చెయ్యాలె. ఈ పద్ధతిని మనం మార్చాలి..." వాదిస్తూ అన్నాడు దామోదర్.

"ఆ పద్ధతిని మార్చి మాత్రం ఏం సాధిస్తారు. సగటు మనిషి ఏ మతం వాడైనా ... ఏ దేవుడికి మొక్కినా కోరుకునేది పిడికెడు మెతుకులే కదా! ప్రశాంత

జీవితం ముఖ్యం కానీ ఏ దేవుడు ఏ గుడీ ముఖ్యంకాదు గదా! ఎవరి బతుకు వారిది అది మన సంస్కృతిలో ఒక భాగంగా వస్తున్నదే కదా" అంది శిల్ప.

ఆ మాటల లోతు దామోదర్‌కు అందలేదు. తన వాదనను బలంగా చెప్పడానికి నోరు పెద్దది చేసుకున్నాడు. 'మీ ఊరే తురుకోళ్లది. అందుకే నీకీ బుద్ధులు' అని దెప్పిపొడిచాడు.

శిల్పకు పొలమారింది. పక్కనే ఉన్న బాటిల్‌ను అందించాడు కరీం. గటగటా నీళ్ళు తాగి టిఫిన్ మూసివేసింది.

"అదేంటి మేడం... మధ్యలో లేచారు. తినండి. ముందే సైన్స్ సబ్జెక్టు. ఖాళీ కడుపుతో అంతగా చెప్పలేరు" వారించబోయాడు కరీం.

శిల్ప వినలేదు. చేయి కడుక్కుని వచ్చి కూర్చుంది. కరీం కూడా టిఫిన్ ఎత్తాడు. టేబుల్ తుడిచి చేయి కడుక్కుని వచ్చి కూర్చున్నాడు.

శిల్ప పేపర్ చదువుతుంది. తనుగూడా పేపర్ తెరుస్తూ "మనుషుల్ని ఏ విషయాలు ఎక్కువగా ప్రభావితం చేస్తూ ఉంటాయంటారు మేడం" అడిగాడు కరీం.

"మనిషిలో రాక్షసత్వం నిగూఢంగా దాక్కుని ఉంటుంది. ఆ రాక్షసుల్ని తృప్తి పరిచే ఏ విషయమైనా మనిషిని ప్రభావితం చేస్తుంది" అన్నది కసిగా శిల్ప. ఆమె మొహంలో ఏదో ఆందోళన.

ఇంటికి వెళ్ళిన పిల్లలు ఒక్కొక్కరే చేరుకుంటున్నారు. గ్రౌండ్‌లో అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి.

'అంటే?" ఆమె మాటలు అర్థంకాక కాదు. వివరణ కూడా ఆమె నోటి వెంటనే వినాలని అడిగాడు కరీం.

అది శిల్పకు తెలుసు. చాలాసార్లు చాలా విషయాలపై విశ్లేషణగా మాట్లాడుకుంటారిద్దరూ. ఆమె విశ్లేషణ లోతుగా ఉంటుంది.

"అంటే... మనం రోడ్డు మీద వెళ్తున్నామనుకోండి. మన కళ్ళముందే ఆక్సిడెంట్ జరిగి ఎవరో ఒకరికి రెండు కాళ్ళు విరిగాయనుకోండి. మనం మంచితనపు రంగును పులుముకుని వాళ్ళను హాస్పిటల్లో చేరుస్తాం. బంధువులకు ఫోన్ చేస్తాం. ఆపదలో ఆదుకున్నాడని అందరూ పొగుడుతుంటే మనలోని రాక్షసుడు ఉప్పొంగి పోతుంటాడు. కానీ కాళ్ళు విరిగిన వ్యక్తిని చూసి రెండు కన్నీటి చుక్కలైనా రాల్చము" ఏదో ట్రాన్స్‌లో చెప్పినట్టుగా చెప్పింది శిల్ప.

ఈ విశ్లేషణ కరీంకు అందలేదు. అర్థం అయి కానట్టుగా అనిపించింది. అతడి మొహం మీది భావాలను స్పష్టంగా చదువగలదు శిల్ప. తను చెప్పింది అతడికి అర్థంకాలేదని గ్రహించినాక మళ్ళీ మొదలుపెట్టింది.

"మా హిందూస్థానీ చికెన్ సెంటరే ఉందనుకోండి. వారంలోనే ఊరు ఊరంతా తెలిసిపోయింది. జనం క్యూ కడుతున్నారు. ఎందుకని...? ఒక మతాన్ని రెచ్చగొట్టే విషయాన్ని వాళ్ళు విశాల భావన, ఏకత పేరున అంగీకరిస్తూ ఆనందం పొందుతున్నారు. అలాల్ ముడుదార్ అనేది వ్యక్తిగత విషయమైనా దాన్ని రగిలించడంలో మనిషికో చెయ్యివేసి పైశాచికానందంను పొందుతున్నారు..."

విఠల్ సార్ రావడంతో మాటలు ఆగిపోయాయి.

ఎప్పుడూ ప్రశాంతంగా తనకు ఏ విషయమూ అంటనట్టుండే విఠల్ ఎందుకో ఉద్వేగంగా ఉన్నాడు. స్టాఫ్ రూంలోకి అడుగుపెడుతూనే "ఫ్లాష్ న్యూస్ తెలుసునా కరీం సార్... బాబ్రీ మసీదు మాదేనట. తవ్వకాల్లో రామ టెంక నీలు బయటపడ్డాయట" మాటలు ఒత్తి పలుకుతూ అన్నాడు.

వెంటనే అందుకుంది శిల్ప. ఎక్కడ ఎవరు కొద్దిగా మాట జారినా పట్టి దులుపుతుంది అని స్టాఫ్ అందరికీ తెలుసు. "విఠల్ సార్... కరీం సార్ మీకు మూడేండ్లుగా తెలుసు. ముక్కూమొహం తెలియని వాళ్ళంతా మీ వాళ్ళయిపోయారు. మూడేండ్లనుంచి పరిచయమున్న వ్యక్తి పరాయి వాడైపోయాడు. విధ్వంసపు విషయాల్లో మనుషులు ఎందుకింతగా ఏకమవుతారో చెబుతారా..?" నిలదీసినట్టుగా అడిగింది.

"అసలు మీరు ముస్లింలుగా పుట్టాల్సింది మేడం. అన్ని విషయాల్లో వాళ్ళను వెనకేసుకస్తరు. వాళ్ళు వలస వచ్చిన వాళ్లంటే ఆర్యులు వలసదారులు కారా! అంటరు. ఇలాంటి మన అనైక్యతనే వాళ్ళకు బలం. మీకో విషయం తెలుసునా... ఇద్దరు ముస్లింలు తన్నుకుంటున్నారనుకో... వాళ్ళను విడిపించడానికి ఒక హిందువు పోతే ఇద్దరు ఏకమై వీన్ని తంతరు. అలాంటి ఐకమత్యం వాళ్లకుంటది. మన దేశంలో వాళ్ళకున్న స్వేచ్ఛ సదుపాయాలు వాళ్ళ దేశంలో మనకున్నాయా...?" ఆవేశంగా విఠల్.

"మనపక్కనున్న వ్యక్తినే పరాయివాడిగా చూస్తున్నాం. ఇక దేశాల సంగతి ఎందుకు సార్. వీళ్ళు వాళ్ళని కాదు. ఎవలకు అన్యాయం జరిగితే వాళ్ళ

గురించి మాట్లాడాలి. మన స్వేచ్ఛ, లౌకిక సామ్యవాదాలలో వాళ్ళు భాగస్వాములే కదా ! వాళ్ళను అభద్రతా భావానికి గురిచేస్తున్నదెవరు...?" మొండిగా అడిగింది శిల్ప.

స్టాఫ్ ఒక్కొక్కరే చేరుకుంటున్నారు. అటెండర్ ఫస్ట్ బెల్ కొట్టాడు. పిల్లల అల్లరి ఎక్కువయింది. పి.యి.టి. పిల్లలను అదుపు చేస్తున్నాడు.

"అందుకే మేడం.. ఈ ఆలోచనలతోనే ఇంట్లో పొంతన కుదరక నలిగిపోతుంటారన్నాను" అన్నాడు కరీం.

చిన్నగా నవ్వి ఏదో చెప్పింది శిల్ప. సంభాషణ లోంచి పక్కకు తొలిగాడు విఠల్. అతడిని మళ్ళీ చర్చల్లోకి లాగాలని చూసింది శిల్ప. కారంచేడు మొదలుకుని కార్గిల్ వరకు స్టాఫ్‌లో వాదోపవాదాలు జరుగుతాయి. ఎవరిని ఎందులోకి లాగి దులుపేస్తుందోనని అందరూ నేర్పుగా తప్పుకుంటారు. తప్పని పరిస్థితుల్లో ఆమెను సమర్థిస్తారు. విఠల్ కూడా అలాగే తప్పుకున్నాడు.

శిల్ప అంత తొందరగా వదలక పోతుండె. కాని అప్పుడే పోస్ట్‌మాన్ వచ్చాడు. అతడిచ్చిన ఉత్తరాన్ని అందుకుని తిరగేసి చూసింది.

'ఫ్రం ఫాతిమా. ముస్తాఫానగర్, గంభీరావుపేట'

శిల్ప హృదయం ఒక్కసారిగా దరువేసింది. అపూర్వమైన కానుకేదో అందుకున్నట్టు ఉత్తరాన్ని తిప్పి తిప్పి చూసింది. మాటలన్నీ మరిచి చూపులు, ఆలోచనలు ఉత్తరంపైనే నిలిపింది. ఇంతవరకు సాగిన చర్చకు కొనసాగింపుగానే ఈ ఉత్తరం రావడం ఊహించకపోయినా అందులో ఏముందో మాత్రం ఊహించింది శిల్ప.

విఠల్ ఏదో కదిలించాడు. కరీం ఏదో వాదించాడు. సెకండ్ బెల్ మ్రోగింది. పిల్లలు క్లాస్ రూముల్లోకి వెళ్ళారు. గ్రౌండ్ మౌనముద్ర వేసుకుంది. చెట్లమీద చిలుకలు చేరి క్లాస్‌రూంల వైపు ఆసక్తిగా చూస్తున్నాయి.

శిల్ప ఉత్తరం చదువుతుంది. ఉత్తరంతోపాటు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటుంది. ఫాతిమాది ఇంటి పక్క ఇల్లే. ఒక తల్లికి పుట్టినట్టుగా పెరిగారు. ఇంటర్ చదువుకు ఫాతిమాను బయటకు పంపించలేదు చిచా. తన డిగ్రీ బి.ఎడ్ ఉద్యోగం పెండ్లి వెంటవెంటనే జరిగిపోయాయి. అయినా స్నేహం ఆగిపోలేదు. ఎప్పుడు ఊరెళ్లినా ఫాతిమా ఇంట్లోనే. తన పెళ్ళికంటే ముందే ఫాతిమా పెళ్ళయింది. అప్పటినుంచి ఒకరినొకరు కలుసుకోలేదు.

"ఇదో... యాదికుందా! ఈ వారంలలనే పీరీల పండుగ. ఉద్యోగమస్తే దస్తీ కడుతనని దుమ్ము పిల్లనిస్తనని పక్కీరు మొక్కుకున్నవు. ఉద్యోగం కాదు. మొగుడు కూడా వచ్చాడు. ఈసారి నేను ముందుగానే వచ్చాను. నువ్వు కూడా తప్పకుండా రావాలి.

శిల్ప ఉత్తరం చదువుతుంది. అక్షరం అక్షరం దగ్గర ఆగి ఆగి చదువుతుంది. తనలో తాను గతాన్ని కెలుక్కుంటుంది. ఇంటిముందే పీరీల మసీదు. ఆ వాడనే పక్కీరోళ్ళవాళ్ళ రంజాన్ వస్తే అత్తరు సీసాలు చమ్కీ దండలు. బక్రీద్ వస్తే కొత్త బట్టలు. మెరుగు గులాలు. పీరీల పండక్కి వారం రోజుల సందడి. ఎట్లా తను పక్కీరయి భిక్షం ఎత్తేది.

"మేడం.." అటెండర్ గట్టిగా పిలవడంతో ఉలిక్కిపడింది శిల్ప.

అప్పటికి ఎన్నిసార్లు పిలిచాడో... అసహనంగా ఉన్నాడు. స్టాఫ్‌రూంలో ఎవరూ లేరు. అటెండెన్స్ తీసుకుంటున్నారు. వన్, టూ, త్రీ ప్రజంట్ సార్..... మాటలు కలిపి వినిపిస్తున్నాయి.

అటెండెన్స్ రిజిష్టర్ ముందట పెట్టాడు అటెండర్. ఆదరా బాదరా లేచి ఉత్తరాన్ని మడిచి బ్యాగ్‌లో వేసుకుంది శిల్ప. రిజిష్టర్‌లో సైన్ చేసి చాక్‌పీస్ డస్టర్ తీసుకుని క్లాస్‌రూంకు వెళ్ళింది.

అటెండెన్స్ తరువాత లెసన్ మొదలుపెట్టబోతూ పిల్లల వైపు చూసింది శిల్ప. కాషాయం డ్రెస్సులు నాలుగు నుంచి ఏడుకు పెరిగాయి. నుదుటన బొట్టు మెడలో మాలతో హనుమాన్ దీక్షలో ఉన్నారు. వెనుక బెంచిలోనైతే మాల వేసుకున్న వెంకటేష్ అటూ ఇటూ సలీం ముక్తార్‌లు కూర్చున్నారు. వారు ఏదో ఉద్వేగంలో కూర్చున్నట్టుగా ఉన్నారు.

వారం రోజులకిందనైతే దేవుడి గురించి టెంత్ క్లాస్‌లో పెద్ద గొడవనే జరిగింది. దీక్షలో ఉండగా నన్ను తన్నాడని రాము, నా నోట్‌లో జైశ్రీరామ్ రాసాడని ఖలీల్ విరుద్ధ భావాలు ఏర్పరుచుకుని కొట్లాడుకున్నారు. తను అప్పుడే హెడ్ మాస్టార్‌కు రిపోర్ట్ చేస్తూ "సర్! యూనిఫాం ఎందుకు పెట్టాం. పసి మనసుల్లో పేద ధనిక భేదపు ఛాయలు కనిపించకూడదనే కదా! ఇప్పుడు వీళ్ళు కాషాయపు బట్టలతో స్కూల్‌కు వస్తే అంతకంటే ప్రమాదకరమైన భావాలు నాటుకుంటున్నాయి. అందుకే అలా అనుమతించవద్దు" అని చెప్పింది.

ఆ రోజు స్టాఫ్‌లో పెద్ద వాదనే బయలుదేరింది. ఒకరు అవునంటే ఇంకొకరు కాదన్నారు. "హనుమాన్ దీక్ష ఏడాదికి ఒక్కసారే వస్తుంది. ఇంట్లో

ఏవో మొక్కులు మొక్కుకుంటారు. వద్దని మనం ఎట్లా అనగలము. ప్రతీ శుక్రవారంనాడు నమాజు ఉందంటే ముస్లిం పిల్లలను వదిలిపెట్టడం లేదా.... వాళ్ళు టోపీలు పెట్టుకుంటే అత్తరు చల్లుకుంటే మనం వద్దంటున్నామా..?" హిందీ సార్ ఎదురు తిరిగాడు.

"మేడమ్... లెసన్ చెప్పండి" పిల్లల అరుపు. తేరుకున్న శిల్ప డస్టర్ అందుకుని బోర్డువైపు తిరిగింది. పొద్దున సోషల్ టీచర్ చెప్పిన లెసన్ బోర్డుమీదనే ఉంది.

భారతదేశపు సార్వభౌమ లక్షణాలు... సెక్యులరిజం... సర్వమత సహనం... డస్టర్‌తో ఒక్కొక్క అక్షరాన్ని తుడిచింది. జీర్ణ వ్యవస్థ గురించి చెప్పింది. జీర్ణంకాని ఎన్నో అంశాలు శిల్పకు లోలోన కదులుతున్నాయి. ఒక స్వచ్ఛమైన నీటిసరస్సును కలుషితం చేయడానికి ఎక్కడో విషపు ధార మొదలయి నట్టనిపించింది.

ఆరోజు ఆలస్యంగానే ఇంటికి చేరుకుంది శిల్ప. బస్టాండ్‌లో ఫాతిమా ఉత్తరాన్ని చదువుకుంటూ చాలాసేపు గడిపింది. ఇంటికి చేరుకునేసరికి రెండు కార్లు కనిపించాయి. హాలు నిండా జనం. వాళ్ళ టీలు, టిఫిన్‌లకు అత్తయ్య హైరానా పడిపోతుంది. శిల్పను చూడగానే తేలిగ్గా ఊపిరి పీల్చుకుని "రా... ఏమిటింత లేటు... వీళ్లకు సర్దలేక ఛస్తున్నా" అంది చేతిలోని ట్రేను కిందపెడుతూ. మొహం కడుక్కుని క్షణాల్లో శిల్ప పనిలో మునిగిపోయింది.

హాల్లో మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. అంతవరకు చర్చ వాడిగా వేడిగా సాగినట్టుంది. ఒక్కొక్కరు ఏదో తీర్మానం చేస్తున్నారు.

"ఎవరు వాళ్ళు..." అత్తయ్యను అడిగింది శిల్ప.

"తెలియదమ్మా.. ఎవరో వస్తుంటారు పోతుంటారు..." నిరాసక్తిగా అన్నది అత్తయ్య. పనిచేసుకుంటూనే అటువైపు చెవి పెట్టింది శిల్ప.

"...గుజరాత్‌లో హిందువులందరినీ ఏకం చేసాం కాబట్టి గెలిచాం. ఈరోజు హిందూ ఎజెండాను మరిచిపోయాం కాబట్టి అధికారం కోల్పోయాం. మన ఫార్ములాలు మనకున్నాయి. వాటిని అమలుచేస్తే తప్ప ఉనికిని కాపాడుకోలేం.." దామోదర్ వాదిస్తున్నాడు.

"ప్రజలను ఏకం చెయ్యాలి... వచ్చేది పీరీల పండుగ. మన వాళ్ళు లేనిది గుండం మండదు. అది మన పండుగు కాదని ప్రచారం చెయ్యాలి. అన్ని కులాలను ఏకం చెయ్యడం సులువైన పని కాదుగానీ, కులాలన్నింటిని

ఒక మతం కిందికి తెచ్చి ముస్లింలపై వ్యతిరేకతను ప్రదర్శించే ఒకే ఒక పని చేత అందరినీ మనం ఏకం చెయ్యవచ్చు. అది దేవుడి పేరు మీదనే సాధ్యం" ఎవరో పెద్ద గొంతుతో చెబుతున్నారు.

శిల్ప ఉలిక్కిపడింది. ఆమె చేతుల్లోని ప్లేటు వణికింది. అత్తయ్య వారిస్తున్నా టిఫిన్ ప్లేట్లతో హాలులోకి అడుగుపెట్టింది.

"అది నిజమే. దేవునికి విరుగుడు దేవుడే. అదే సమయంలో మనం ఊరూరున కోటి నోముల యజ్ఞం మొదలుపెట్టాలి. ఇందులో అందరినీ ఇన్వాల్వ్ చేయాలి. ఇంటింటా రామకోటి రాయించాలి. అలా మెజారిటీ వర్గాన్ని మనవైపు తిప్పుకోవాలి. దేవుడి బీజాన్ని ఎంత తెలివిగా నాటితే అంత ఫలితం ఉంటుంది..." భార్యను చూసి దామోదర్ ఆగిపోయాడు.

శిల్ప మనిషికో ప్లేటు పంచింది. హాలు మధ్యలోకి వచ్చి నిలబడింది.

ఏమనుకున్నాడో దామోదర్. వెంటనే"... యజ్ఞం రేపే ప్రారంభిద్దాం. మేమిద్దరం దంపతులం దీక్ష తీసుకుంటాం. ముస్తాఫానగర్‌లోనైతే ఆమెకు అనుకూలంగా ఉంటుంది. కొంత మందిని కూడా జమచేస్తది" అన్నాడు శిల్ప వైపు చూసి నవ్వుతూ, క్షణాల మీద ఆమోదముద్ర పడిపోయింది.

శిల్పకు కాళ్ళ కింద భూమి కంపించింది. హఠాత్తుగా దాడి జరిగినట్టనిపించింది. క్షణకాలం నిలదొక్కుకుని అందరివైపు పరిశీలనగా చూసింది.

"చూడండి... సగటు మనిషి ఎప్పుడూ మతాన్ని కోరుకోడు. విధ్వంసాన్ని ఆహ్వానించడు. కూడు. గుడ్డ. గూడు... ప్రశాంత జీవనం, వీటికొరకు మీరేదైనా చెయ్యగలరేమో ఆలోచించండి..."

ఒక్కసారిగా హాలునిండా నిశ్శబ్దం.

మరునాడు ఎవరు వారిస్తున్నా వినకుండా బస్సు ఎక్కింది శిల్ప.

● ఆదివారం, ఆంధ్రభూమి-15 ఆగస్టు, 2005 ●